క్లుప్తంగా

బాక్సింగ్‌లో మోహిత్‌కు బంగారు పతకం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వల్లా మోహిత్ శివసాయియాదవ్ నగరంలో శుక్రవారం జరిగిన అండర్ – 14 బాలుర విభాగం జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. 30 – 35 కేజీల విభాగంలో జరిగిన పోటీలో సుమారు పది మంది పాల్గొన్నారు. వీరిలో మోహిత్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. మోహిత్‌ను కోచ్ ఆలీ, తిరుపతియాదవ్ అభినందించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



బిందుకు ఆర్థిక సాయం అందిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ పరిధి కంచరపాలేనికి చెందిన బిందు అనే మహిళ కుమారుడు ఇటీవల మృతి చెందడంతో శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆమెకు అండగా నిలిచారు. శనివారం ఆమె ఇంటికి సంఘ సభ్యులు వెళ్లి రూ.17,500 నగదుతోపాటు బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. బిందు కుమారుడు మృతిచెందడం బాధాకరమని, ఆమె కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు నంబరు సంతోష్‌కుమార్, శీరం రవి, ప్రసాద్‌యాదవ్, సర్వసిద్ధి సాయిలత తదితరులు పాల్గొన్నారు.


కళలను ప్రోత్సహించాలి



విజేతలతో ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: కళలను నిరంతరం ప్రోత్సహించాలని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లలిత్ కళా అకాడమీ భువనేశ్వర్, తంజావూర్‌లోని సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ శుక్రవారం ఏయూ చిత్రకళా విభాగంలో నిర్వహించిన వికసిత్ భారత్ కే రంగ్, కళా సే సంగ్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. ఏయూ విద్యార్థులు చిత్రలేఖనం, నృత్యం, సంగీతం నేర్చుకునేలా ఒక మాడ్యూల్ తయారు చేసి అమలు చేస్తామని చెప్పారు. అనంతరం విజేతలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం, బీవోఎస్ చైర్మన్ శ్రీనివాస్, తంజావూర్‌లోని సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.రంగ భాష్యం, ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ



స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: 'స్వచ్ఛతా హీ సేవా – 2025' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన స్వచ్ఛోత్సవ్ పోస్టర్లను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17న ప్రారంభమై అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయని డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. వీటిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

2 వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలి

మహారాణిపేట: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వర రావు పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, స్వర్ణభారతి స్టేడియం సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ ఐడీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, గర్భిణులకు అందిస్తున్న వైద్యం, క్యాన్సర్ పరీక్షలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ 2 వరకు కొనసాగించాలని, గర్భిణులకు వైద్య సేవలు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



కరాసా నుంచి వచ్చే రహదారిలో బీమ్ లేని హైట్ బారియర్



ఎన్ఏడీ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పడి ఉన్న హైట్ బారియర్ బీమ్‌లు

రాకపోకలకు బేజారు

- ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్ద రహదారుల్లో కానరాని హైట్ బారియర్‌లు
- బీమ్‌లు ఉన్నా.. ఏర్పాటు చేయని అధికారులు
- సర్కిల్‌లో ఇరుక్కుపోతున్న భారీ వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బాజీ జంక్షన్ వద్ద బీమ్ లేని హైట్ బారియర్

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన నాటి నుంచి హైట్ బారియర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లైఓవర్ వంతెన దిగువన రాకపోకలు సాగించే రహదారిలో హైట్ బారియర్‌లు గతంలో ఏర్పాటు చేశారు. వీటిని పలు వాహనాలు ఢీకొట్టడంతో పాడయ్యాయి. ప్రధానంగా మర్రిపాలెం, కరాసా నుంచి వచ్చే రహదారిలో, గోపాలపట్నం నుంచి వచ్చే రోడ్డులో ఏర్పాటు చేసిన హైట్ బారియర్‌లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి.

ఎరక్కపోయి వచ్చి.. ఇరుక్కుపోయి..!

ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద దిగువ రోడ్డులోకి భారీ వాహనాలు రాకుండా ఉండేందుకు హైట్ బారియర్‌లు ఏర్పాటు చేశారు. బాజి జంక్షన్ వద్ద గల హైట్ బారియర్‌ను భారీ వాహనం ఢీకొట్టి దెబ్బతినడంతో దాన్ని తొలగించేశారు. ఆ తరువాత మరొకటి ఏర్పాటు చేయలేదు. దీంతో భారీ వాహనాలు ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ సర్కిల్‌లోకి వచ్చి ఇరుక్కుపోతున్నాయి. ఎరక్కపోయి వచ్చి.. ఇరుక్కుపోయామంటూ భారీ వాహనాల డ్రైవర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇతర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్కిల్‌లో ఇరుక్కున్న వాహనం బయటకు వచ్చేందుకు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావని వాహన చోదకులు వాపోతున్నారు. వాహనాలు ఇరుక్కుపోవడం వల్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడా దెబ్బతింటోందని చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

హైట్ బారియర్‌ల పునర్నిర్మాణానికి కావాల్సిన బీమ్‌లు ఎన్ఏడీ వద్దే ఉన్నా.. వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు మొగ్గు చూపడం లేదు. చాలా ఏళ్ల తరువాత నాలుగు నెలల కిందట ఇక్కడ హైట్ బారియర్‌లు నిర్మించారు. అవి వెంటనే విరిగిపోయాయి. కనీసం డ్రైవర్లకు అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీనిలో అటు వీఎంఆర్‌డీఏ అధికారులు.. ఇటు ట్రాఫిక్ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై వాహన చోదకులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సెంటర్ సర్కిల్‌ను కూడా నిర్లక్ష్యం చేసి అధ్వానంగా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి హైట్ బారియర్‌లు ఏర్పాటు చేసి, భారీ వాహనాల వల్ల ప్రయాణికుల పడుతున్న ఇబ్బందులను తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ రోడ్డులో ఇరుక్కున్న భారీ లారీ (ఫైల్)

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ రాము

సింధియా : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని జోన్–5 జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో మల్కాపురం మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో డ్రై డే–ఫ్రై డేపై శుక్రవారం అవగాహన కల్పించారు. జెడ్సీ బి.రాము, బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, వరప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. డ్రై డే – ఫ్రై డేపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలంతా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. దోమల నియంత్రణ కోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గేదెల రమణ, నాని, జిల్లా మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, జిల్లా మలేరియా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్, నవరత్నం, ఉరుకూటి సతీష్‌యాదవ్, సునీల్, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు రైల్వే కార్మికుల ధర్నా



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ పి.రామమోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహనరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, రైల్వే కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రైవేటైజేషన్, ఔట్‌సోర్సింగ్ విధానాలకు వ్యతిరేకంగాను, అన్ని విభాగాల్లోని ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు కీలకంగా నిలిచిన ఇంజినీరింగ్ ట్రాక్‌మెన్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్‌కు మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్ అమలు చేయాలని కోరారు. ఎల్‌డీసీ, జీడీసీ ద్వారా సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని, వాటిలో ఇంజినీరింగ్ కార్మికులకు అవకాశం కల్పించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం డివిజనల్ రైల్వే మేనేజర్ ద్వారా రైల్వే బోర్డు చైర్మన్‌కు మెమోరాండం సమర్పిస్తున్నట్లు రామమోహనరావు తెలిపారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు డీఆర్ఎం లలిత్ బోహ్రాకు మెమోరాండం సమర్పించారు. ధర్నాలో జోనల్ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.ఎస్.రావు, కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు ప్రజా ఉద్యమం

మద్దిలపాలెం: తెలుగు భాష పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట తప్పారని... అందుకే ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలుగు దండు వ్యవస్థాపకుడు పరవస్తు సూరి తెలిపారు. మద్దిలపాలెంలోని తెలుగు తల్లి విగ్రహానికి శుక్రవారం నీరాజనాలు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి వెళ్లి అసెంబ్లీ వద్దే గాంధేయ మార్గంలో నిరసన తెలిపి పాలకుల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఉద్యమంలో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇలానే వదిలేస్తే భవిష్యత్ తరాలకు అప్పట్లో తెలుగు ఉండేదని చెప్పే పరిస్థితి వస్తుందన్నారు. పూర్తిగా మన సంస్కృతి నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషాభివద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు, గౌరవం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలందరూ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలనా వ్యవహారాలు తెలుగులో సాగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. వీటి కోసం పోరాడాల్సి రావడం విచారకరమన్నారు. అయినప్పటికీ పాలకులు తెలుగు భాషకు పెద్ద పీట వేసే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తెలుగుదండు ప్రతినిధులు

మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ వ్యాపారులు యథావిధిగా వ్యాపారాలు నిర్వహించడంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ఈ రోడ్డులో పర్యటించారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించిన చోటే మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేసినా, ఆక్రమణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని టీపీవో శ్రీలక్ష్మిని ఆదేశించారు. ఉదయం 7గంటల లోపే పారిశుధ్య పనులు పూర్తి చేయాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించినా పూర్తి చేయక పోవడంపై మండిపడ్డా రు. ముందు రోజు ఆక్రమణలు తొలగించినా ఇంకా చెత్త అక్కడే ఉందని, తక్షణమే పారిశుధ్య పను లు పూర్తి చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ని ఆదేశించారు. పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు, వాహనదారుల కోసం విశాలమైన రోడ్లను ఏర్పాటు చేశారని, వాటిని ఆక్రమణలకు పాల్పడవద్దని తెలిపారు. ఆయన వెంట జెడ్సీ కనక మహాలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు.




ఫుట్‌పాత్‌పై పెట్టిన తోపుడు బండిని సిబ్బందితో తీయిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

టెడ్ వినియోగంతో తాబేళ్ల సంరక్షణ



మాట్లాడుతున్న మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు



టార్టాయిస్ ఎక్స్‌క్లూడర్ డివైస్

మహారాణిపేట: తాబేళ్ల రక్షణకు ప్రతి మరబోటులో తప్పనిసరిగా టెడ్ పరికరాన్ని వాడాలని మత్స్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు పి. లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో ఎంపెడా–నెట్‌ఫిష్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెడ్ (టార్టాయిస్ ఎక్స్‌క్లూడర్ డివైస్) అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మరబోట్లకు టెడ్ పరికరం అమర్చడం వల్ల వలల్లో చిక్కుకున్న తాబేళ్లు సులభంగా తప్పించుకుంటాయని లక్ష్మణరావు వివరించారు. ఈ పరికరం ధర సుమారు రూ. 28 వేలు ఉంటుందని, దీనిని ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద నూరు శాతం రాయితీపై అందిస్తామని తెలిపారు. అలాగే నూరు శాతం సబ్సిడీపై బోట్లకు సరఫరా చేసిన ట్రాన్స్‌పాండర్స్‌ను కూడా తప్పకుండా వాడాలని చెప్పారు. నెట్‌ఫిష్ కోఆర్డినేటర్ హనుమంతరావు మాట్లాడుతూ, అమెరికాకు సముద్ర రొయ్యలు ఎగుమతి చేయాలంటే టెడ్ వాడకం తప్పనిసరి అని తెలిపారు. టెడ్ వినియోగం వల్ల చేపలు, రొయ్యలు తప్పించుకునే అవకాశం ఉండదని, పైగా ఇంధనం కూడా ఆదా అవుతుందని ఎంపెడా మొహంతీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాల్ఫిన్ బోటు యజమానుల సంఘం అధ్యక్షుడు సీహెచ్. వీర్రాజు, ఇతర నాయకులు సూరాడ సత్తిబాబు, బోటు యజమానులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో ఓజోన్ డే

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయాలజీ అసోసియేషన్, జువాలజీ విభాగం సంయుక్తంగా ఏకాలజీ కమిషన్‌తో కలిసి శుక్రవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఒక ప్యానల్ చర్చను నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ హెడ్ డాక్టర్ పి. రూపావాణి మాట్లాడుతూ ఓజోన్ పొర భూమికి ఒక రక్షణ కవచం లాంటిదని, దానిని కాపాడాల్సిన ఆవశ్యకతను వివరించారు. హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ పొందడానికి విద్యార్థులు గొడుగులు ఉపయోగించాలని ఆమె సూచించారు. జెనిత్ ఇంపాక్ట్ వర్క్స్ ఫౌండర్ ఎస్. రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ బాధ్యతగల పౌరులుగా మనం సుస్థిరమైన జీవనశైలిని పాటించడం ద్వారా భూమిని ఎలా రక్షించుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. డాక్టర్ మాణిక్యకుమారి, రొసినా జార్జ్, పి.మేరీ పాల్గొన్నారు.

కొనసాగిన దుకాణాల తొలగింపు

గోపాలపట్నం: ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు ఫుట్‌పాత్‌లు, కాలువలపై ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపు రెండో రోజు శుక్రవారం కొనసాగింది. వంటిల్లు నుంచి గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం, ఏపీఎస్ఈబీ కాలనీ, సుసర్ల కాలనీ, సీతారామరాజునగర్ ప్రాంతాల్లోని దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు పొక్లెయిన్ తో తొలగించి తరలించారు. బీఆర్‌టీఎస్ రహదారి లోని ఆక్రమణలను తొలగించారు. కాలువలు, ఫుట్‌పాత్‌లపై దుకాణాలను ఏర్పాటు చేయరాదని దుకాణదారులకు సూచించారు. శాశ్వతంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–8 కమిషనర్ శంకరరావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రామలింగేశ్వరరావు హెచ్చరించా రు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు, దుకాణదారులు సహకరించాలని కోరారు.

దుకాణాల తొలగింపు వద్ద వివాదం

మల్కాపురం: జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు 58వ వార్డు ములగాడ గ్రామం పరిధిలో సేవా మార్గంపై గల దుకాణాలను సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఆ సమయంలో దుకాణాల యజమానులు, సిబ్బంది మధ్య వివాదం జరిగింది. తమ దుకాణాలను తొలగిస్తే ఊరుకోమని యజమానులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తున్నామని సిబ్బంది బదులిచ్చారు. చివరకు దుకాణాలను తొలగించి సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.



సీతారామరాజునగర్‌లో దుకాణాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు



ములగాడ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది

రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్‌పై పోటీలు



మాట్లాడుతున్న మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్ధశతాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా శుక్రవారం రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై జోనల్ స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పోటీలను ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానం, సాంకేతికతలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతాయని అన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో శాస్త్రీయ విలువలు పెంపొందుతాయని చెప్పారు. పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు, యలమంచిలి, ఎస్.కోట, తగరపువలస, చింతపల్లి, మర్రిపాలెం, కృష్ణా కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ పి.ఎల్. శరణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నివేదిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అనూష, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ధర్నా

పెదగంట్యాడ: స్థానిక ప్రజలకు హాని కలిగించే అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని (సిమెంట్ గ్రైండింగ్ యూనిట్) ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని సర్వే నెంబర్లు 97పి, 98 పి, 99 పి, 101లోని ప్రభుత్వ భూమి సుమారు 20 ఎకరాల్లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు, నాయకులు ఈ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న అదానీ గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్, డంపింగ్ యార్డ్ వల్ల కాలుష్య సమస్యలతో ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఇప్పుడు మళ్లీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే తద్వార ఎగిసిపడే ధూళి, కాలుష్యంతో పరిసర ప్రాంతంలోని ఏడు వార్డుల ప్రజలకు మరిన్ని ఆరోగ్యసమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని హెచ్చరించారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. వనజాక్షి, జి. ఆనంద్, పల్లేటి పోలయ్య, కె. అచ్చుతరావు, దుర్గారావు, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

స్నాతకోత్సవం సమర్థంగా నిర్వహించాలి

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని సమర్థంగా నిర్వహించాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. స్నాతకోత్సవ నిర్వహణపై వివిధ కమిటీల సభ్యులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రిసెప్షన్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీ, సైటేషన్ కమిటీలకు కేటాయించిన బాధ్యతలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. స్నాతకోత్సవ మందిరానికి అవసరమైన మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశించారు. అందరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారి సంఖ్య, అవార్డులు, మెడల్స్ వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. నగదు బహుమతులను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆన్ డ్యూటీ పాసులు మంజూరు చేయాలని సూచించారు. సబ్ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక పూజ నిర్వహిస్తామని, పాల్గొనాలనుకునే భక్తులు రూ.500 చెల్లించి దంపతులు లేదా ఇద్దరు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి తెలిపారు. వివరాల కోసం 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.